# కవితా కౌముది

## భావాల నదిలో..

కె.వి.శాస్త్రి

భావాల నదిలో నా మనసు
నిశ్శబ్దం పలుకరించని వేళలో
మనసు మాత్రమే మాటలాడుతుంది,
అక్షరాలకంటే ముందే పుట్టిన భావాలు
శ్వాసల మధ్య ఊయలలూగుతుంటాయి.
ఒక భావం ఉదయపు వెలుగై వస్తుంది,
మరో భావం సంధ్య మబ్బులై కమ్ముకుంటుంది,
కొన్ని జ్ఞాపకాలు వెన్నెలలా తాకుతాయి,
మరికొన్ని వర్షపు చుక్కలై గుండెను
తడుపుతాయి.
అన్నీ కలిసే ఈ మనసు లోకంలో
నేను నన్నే వెతుక్కుంటూ నడుస్తాను.
ఎప్పుడో వినిపించిన మాటలు,
ఇప్పుడో గుర్తొచ్చే మౌనాలు,
చిన్న చూపు, తేలికైన నవ్వు—
వీటన్నిటికీ కూడా ఓ చిరకాల నివాసం
ఈ హృదయంలోనే ఉంది.
కాలం ముందుకు సాగుతుంటే
మనసు మాత్రం వెనక్కి తిరిగి చూస్తుంది,
అప్పటి అమాయకత్వాన్ని
ఇప్పటి అవగాహనతో తూచుతుంది.
అక్కడే పుడుతుంది ఒక మధురమైన బాధ,
అదే మళ్లీ జీవించాలనే తపనగా మారుతుంది.



కొన్ని క్షణాలు భారంగా మారతాయి,
కొన్ని క్షణాలు పువ్వుల్లా తేలిపోతాయి,
కాని ప్రతి క్షణం కూడా
నాకు నేనే దగ్గరవుతున్న మార్గమే.
ఈ శరీరం కేవలం ఒక రూపం కాదు,
ఇది అనుభూతుల ఆలయం,
ప్రతి ఊపిరి ఒక ప్రార్థన,
ప్రతి ఆలోచన ఒక దీపం.
ఎక్కడో లోపల అవిచ్ఛిన్నమైన శాంతి
ప్రవహిస్తోంది,
అది శబ్దంలో కాదు, అది గోలలో కాదు,
అది లోతైన అంగీకారంలో ఉంటుంది.
నడుస్తూ నేర్చుకుంటాను,
తడబడుతూ బలపడతాను,
విడిచిపెడుతూ తేలికపడతాను,
అర్థం చేసుకుంటూ ఎదుగుతాను.
ఇదే జీవితం—
పూర్తిగా అర్థం కాకపోయినా
పూర్తిగా అనుభవించాల్సిన ప్రయాణం.
ఈ భావాల నదిలో నేను కొట్టుకుపోవడం లేదు,
ఈదుతున్నాను కాదు— నెమ్మదిగా
కలిసిపోతున్నాను. నాలోనే…
జీవితంతో…
శాశ్వతమైన ఆ నిశ్శబ్దంతో. ★★★★

## కాలం
### శిష్ట్లా వి ఎల్ ఎన్ శర్మ

కాలం.... చాలా బరువైనది
అంతేకాదు....
విశ్వాంతరాళాల బరువునూ
మోస్తూ గమిస్తుంది....
తన ప్రయాణంలో
కర్తవ్యాన్ని క్రమీకరిస్తూ
ఎంత బరువుగా సాగిపోతుందో..

లీలగా గోచరించే కాలగమనంలో
అనంత జీవన తరంగాల నాదాలు
కనిపించక నడిచిపోతూ
నడిపించే క్షణాలలో
నిశ్శబ్దంగా గోచరించే
అనుబంధాలు....అనుభూతులు....

ఖండఖండాలుగా విభజించిన
కాల గమనానికి
రేబవళ్ళ సాదృశ ప్రమాణాలు
దృశ్యము.... అదృశ్యము
రెంటినీ సమంగా సమీకరించి
మన ముందుంచే కర్తవ్య కెరటం కాలం!

★★★



## దృక్కోణం
### అనూరాధ బండి

రహస్యం రహస్యంగానే మిగిలి
ప్రశ్నలను దాటవేసాక
జవాబులు ఎవరికి కావాలీ.

హత్తుకోవడానికి
కొన్నంటే కొన్ని జ్ఞాపకాలూ మిగలనప్పుడు
ఎవరైనా ఏమవుతారూ.

ప్రేమకి కూడా ఒక వాకిలి ఉంటుందా.
రాకపోకలకు మనసులు అలవాటుపడక
హృదయాలు బరువెక్కుతాయని ఎక్కడ చదవాలీ.

గడ్డకట్టుకున్న విషాదం
కరగని నిజమయినప్పుడు
కొన్ని అంటే కొన్ని మాటలూ పుట్టవు.

మనం మిగలని కథలకి
ఎందుకు ప్రాణం అని సందేహపడితే
సిరా వణుకుతుంది కదూ
ప్రేమెలా గల్లంతవుతుందని.

ఎన్నిసార్లు అరచేతుల్లో చూసుకున్నా అవే గీతలు.
ఎంత మస్తిష్కంలోకి చూసుకున్నా అవే ఆలోచనలు.
ఎవరి మనసుల్ని ఎవరు కదిలించగలరూ

★★★

# రసరేఖలు

## శ్రీధర్ బచ్చోటి

ఎన్నడోనేమి చేసితినెఱుగనిపుడు
చెలిగినట్టులు తోచు మస్తిష్కమందు
అన్న్యలకు మేలొనర్చు కార్యములు కొన్ని
పరుల మనసుల నొప్పించు పనులు కొన్ని

మరచిపోయినవెప్పుడో తిరిగి వచ్చు
ఏ ఫలమ్ములు కల్గెనో యెఱుగజేయు
కొన్ని బహుశుభప్రదములై కూర్చు ముదము
కొన్ని దుఃఖకారకములై గ్రుచ్చుచుండు

కలసిపోయిననవి కాలగర్భమందు
స్మృతిపథమ్మునవెప్పుడో మెలగుచుండు
వెడలిపోయిన దీర్ఘజీవితము గూర్చి
మననమొనరించుకొనుచుందు దినములన్ని

అతులమోదము గూర్చు కార్యములు కొన్ని
స్వాంతమును నొవ్వజేయు దోషములు కొన్ని
తిరిగి సరిదిద్దగల పరిస్థితులనన్ని
చక్కబెట్టిన బ్రతుకగు సార్థకమ్ము

హృదయమందున గలవు సత్కృతులవెన్నొ
చేయ ముందుకు సాగదు చిత్తమెపుడు
ఆద్యవస్థను విడి వానినాచరింప
మనకునొరులకు గల్గు సమ్మదము సతము

COMMENTS